సాక్షి పెద్దపల్లి

శుక్రవారం : 23 : జూన్ : 2023



తంజావూరుకు కళాకారులు

పెద్దపల్లిరూరల్: రాఘవాపూర్‌కు చెందిన ఒగ్గు డోలు కళాకారులు తమిళనాడు రాష్ట్రంలోని తంజావూరులో జరిగే సమ్మర్ ఫెస్టివల్‌లో ప్రదర్శనలు ఇచ్చేందుకు గురువారం బయల్దేరి వెళ్లారు.



పత్తి క్వింటాల్‌కు రూ.6,811

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో పత్తి క్వింటాల్‌కు గురువారం రూ.6,811 పలికింది. కనిష్టంగా రూ.6,155, సరాసరి రూ.6,678గా నమోదైనట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి తెలిపారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.0/28.0

ఆకాశం మేఘావృతమవుతుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు, మరి కొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది

న్యూస్‌రీల్

ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి ప్రారంభం



ఉత్పత్తి అవుతున్న యూరియా

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫర్టిలైజర్ కర్మాగారంలో గురువారం యూరియా ఉత్పత్తి ప్రారంభమైంది. కర్మాగారంలో సాంకేతిక సమస్యలు ఏర్పడడంతో 15 రోజులుగా మరమ్మతు చేస్తున్నారు. అప్పటి నుంచి యూరియా ఉత్పత్తి నిలిపివేశారు. రాత్రి షిఫ్ట్ నుంచి యూరియా ర్యాక్‌లలో లోడ్ చేసేందుకు సిద్ధం చేశామని కర్మాగారం అధికారులు తెలిపారు.

జేఎన్టీయూలో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

కమాన్‌పూర్: మంథని జేఎన్‌టీయూలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ఒరాకిల్, కాప్‌జెమిని, డెలాయిట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఓపెన్‌సోర్స్ సాఫ్ట్‌వేర్, సిస్టం అడ్మిన్ విత్ లైనెక్స్ ఓస్ కమాండ్స్, పైథాన్ ప్రోగ్రామింగ్, డెటా సైన్స్ విత్ వెబ్ స్క్రబ్లింగ్‌పై ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు వివరించారు. ఒరాకిల్‌కు చెందిన సయ్యద్ షీబాం సాధిఖ్, కొత్త సాయికృష్ణ, డెలాయిట్ నుంచి సాయిఅనూష, కాప్‌జెమిని, సాయి, మోనిక, సీఎస్ఈ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈఈఈ విభాగం అధిపతి దుర్గారావు, డీఈఈ సతీశ్, ఆఫీసు సూపరింటెండెంట్ రవికుమార్, పీడీ పింగిళి కృష్ణారెడ్డి ఉన్నారు.


అమరవీరుల స్తూపం నిర్మాణానికి ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత

సుల్తానాబాద్: పట్టణంలో అమరవీరుల స్తూపం నిర్మాణానికి పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత అన్నారు. బల్దియా కార్యాలయంలో గురువారం పాలకవర్గం సమావేశమైంది. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల జ్ఞాపకార్థం స్తూపం పట్టణంలో ఉండాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ముందుకొచ్చారని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇందులోభాగంగా సుల్తానాబాద్ నుంచి పూసల రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి టెండర్ పూర్తయిందని, గట్టెపల్లి రోడ్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు తారు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. కమిషనర్ రాజశేఖర్, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్లు కూకట్ల గోపి, గుర్రాల శ్రీనివాస్, తిరుపతి, గొట్టం లక్ష్మి, గాజుల లక్ష్మి, జ్ఞానేశ్వరి, మమత, అరుణ, మేనేజర్ అలీమొద్దీన్, సిబ్బంది సాగర్ పాల్గొన్నారు.

జిల్లా సైన్స్ అధికారికి రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న రవినందన్‌రావు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ఉన్నత పాఠశాలల నుంచి స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ పోటీల్లో వినూత్న ఆవిష్కరణలు సమర్పించేలా ప్రోత్సహించిన జిల్లా సైన్స్ అధికారి రవినందన్ రావుకు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. అవార్డును హైదరాబాద్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ చేతుల మీదుగా అందుకున్నారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన గ్రాండ్ ఫినాలెలో అవార్డు ప్రదానం చేసినట్లు డీఈఓ మాధవి తెలిపారు. అలాగే ధర్మారం విద్యార్థినుల తుదిప్రదర్శన టాప్‌టెన్‌లో స్థానం దక్కించుకుందని పేర్కొన్నారు.

బండి వచ్చేనా..?!

జిల్లా బీజేపీలో ఎవరికి వారే..

- తలోదారి పట్టిన నాయకులు
- ఇటీవల ముదిరిన గ్రూప్ రాజకీయాలు
- అందుకే ఆయన ప్రోగ్రాం వాయిదా..
- ఈనెల 29న పెద్దపల్లికి సంజయ్ రాక..?



బండి సంజయ్

సాక్షి, పెద్దపల్లి: కారు పార్టీకి ప్రత్యామ్నాయం అంటూ చెబుతున్న కమలం పార్టీలో నేతలంతా గ్రూపులుగా విడిపోవడం.. ఒకరినొకరు బహిరంగంగా విమర్శలు గుప్పించుకోవడంతో జిల్లాలో పర్యటించాల్సిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ తన కార్యక్రమాన్ని రద్దు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈనెల 22న పెద్దపల్లి జెండా చౌరస్తాలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మత్స్య పాడి పరిశ్రమల శాఖమంత్రి పురుషోత్తం రూపాలతో బండి సంజయ్ పాల్గొనాల్సి ఉండగా.. ఇంటిపోరు కారణంగా వాయిదా పడింది. కర్నాటక ఫలితాల అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలతో డీలా పడిన బీజేపీకి.. తాజాగా పెద్దపల్లిలో బండి ప్రోగ్రాం వాయిదాతో కార్యకర్తలు నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు. ఆరో విడత ప్రజాసంగ్రామ యాత్రలో భాగంగా బండి సంజయ్ జిల్లాలో పర్యటించాల్సి ఉండగా గుజ్జుల రామకృష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, గొట్టిముక్కల సురేష్‌రెడ్డి గ్రూప్ రాజకీయాలతో జిల్లాలో పర్యటన లేకుండానే పాదయాత్ర ముగిసింది. దీంతో బండి సంజయ్ పెద్దపల్లికి వస్తాడా..? లేదా..? అనే అంశంపై ఆసక్తి నెలకొంది.

వర్గ విభేదాలతోనే వాయిదా

మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి కొద్దిరోజులుగా వివిధ సందర్భాల్లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ వస్తున్నారు. సమావేశాల్లోనూ అదే వైఖరి కనబరుస్తున్నారు. ఈ క్రమంలో గుజ్జులకు చెక్ పెట్టేలా ఎప్పటినుంచో ఖాళీగా ఉన్న పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని రామగుండం నియోజకవర్గానికి చెందిన రావుల రాజేందర్‌కు ఇచ్చి భర్తీ చేశారు. తరువాత అసెంబ్లీ కన్వీనర్‌గా దాడి సంతోష్‌ను నియమించారు. కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన రావుల రాజేందర్‌తో గుజ్జుల వర్గం అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తూ వస్తోంది. జిల్లా అధ్యక్షుడికి పిలుపు లేకుండానే ఇటీవల ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. మరోపక్క బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేష్‌రెడ్డితో కలిసి కొత్త అధ్యక్షుడు వివిధ కార్యక్రమాలు ఎవరికి వారే అన్నట్లు నిర్వహించారు. ఈ క్రమంలో గుజ్జుల వర్గానికి పూర్తిగా చెక్‌పెట్టేలా రావుల రాజేందర్ కొత్తగా మండలాల అధ్యక్షులను ప్రకటించారు. జూలపల్లి మినహా మిగితా మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులను నియమించారు. దీంతో గుజ్జుల వర్గీయులు కొందరు జిల్లా అధ్యక్షుడినే ఎవరూ గుర్తించడం లేదని, అలాంటి ఆయన మండల అధ్యక్షులను ఏకపక్షంగా ఎలా నియమిస్తారని ప్రెస్‌మీట్ పెట్టి మరీ విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అసెంబ్లీ కన్వీనర్, మండల, పట్టణ అధ్యక్షుల ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు నిర్వహిస్తామని గుజ్జుల వర్గీయులు తేల్చి చెప్పారు. ఇలా జిల్లాలో నాయకులు మూడువర్గాలుగా విడిపోయిన సందర్భంలో ఈనెల 22న పెద్దపల్లి జెండా చౌరస్తాలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో కేంద్ర మత్స్య పాడి పరిశ్రమల శాఖమంత్రి పురుషోత్తం రూపాలతో బండి సంజయ్ పాల్గొనాల్సి ఉండగా వాయిదా పడింది. దీంతో గుజ్జుల వర్గం పైచేయి సాధించినట్లు భావిస్తుండగా.. ఎలాగైనా ఈనెల 29న బండి సంజయ్‌ను జిల్లాకు తీసుకవచ్చేందుకు మిగితా వారు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

పెద్దపల్లి అసెంబ్లీ నుంచి బండి బరిలోకి..?

పెద్దపల్లిలో మూడు వర్గాలుగా విడిపోయి తలోదారిగా ఉన్నా బీజేపీలో గ్రూప్ రాజకీయాలకు చెక్ పెట్టేలా ఇక్కడి నుంచే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పోటీచేయనున్నారా..? అంటే కమలం శ్రేణుల నుంచి అవుననే మాటలే వినిపిస్తున్నాయి. తన సొంత పార్లమెంట్ పరిధిలోని కరీంనగర్, హుస్నాబాద్ కాకుండా పెద్దపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే బాగుంటుందని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కొత్తగా నియమించి, గుజ్జుల వర్గానికి చెక్ పెట్టి, పూర్వరంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో సుమారు 48వేల వరకు మున్నూరుకాపుల ఓట్లు ఉండటం కూడా ప్లస్ అవుతుందని, ఇక్కడ బీజేపీ అనుబంధశాఖలు క్రియాశీలకంగా పనిచేస్తున్న నేపథ్యంలో గెలుపు నల్లేరుపై నడకేనని పెద్దపల్లిని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నియోజకవర్గంలో వివిధ వర్గాలతో బండి టీమ్ మాట్లాడి వివరాలు సేకరించింది. ఇది బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది.



నివాళి అర్పిస్తున్న నాయకులు

అమరుల త్యాగాలతోనే తెలంగాణ



జెడ్పీ సమావేశంలో చైర్మన్ పుట్ట మధుకర్



శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే చందర్

- వారి ఆశయసాధనకు పాటుపడదాం
- అన్నిరంగాల్లో అద్భుతమైన ప్రగతి
- శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు

పెద్దపల్లిరూరల్: అమరుల త్యాగాల పునాదులపైనే ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిందని శాసనమండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి నివాళులర్పించారు. స్వరాష్ట్రం కోసం 1969 నుంచి ఉద్యమాలు సాగాయని, 2001లో కేసీఆర్ సారథ్యంలో మొదలైన ఉద్యమం 14ఏళ్లపాటు సాగి.. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందన్నారు. విద్యార్థిలోకం కదం తొక్కి ప్రాణాలను సైతం లెక్కచేయలేదని ఎమ్మెల్యే దాసరి అన్నారు. శ్రీకాంతాచారి ప్రాణాలు పోతున్నా జైతెలంగాణ నినాదాలు చేశారన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అమరవీరుల కుటుంబసభ్యులను సత్కరించారు. అడిషనల్ కలెక్టర్ లక్ష్మినారాయణ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రఘువీర్‌సింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి, జెడ్పీటీసీలు రామ్మూర్తి, లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, ఎంపీపీలు బాలాజీరావు, స్రవంతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు మరువలేనివి

రాష్ట్ర సాధనలో పోరాడి అమరులైన వారి త్యాగాలు మరువలేనివని జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. సీఈఓ శ్రీనివాస్, జెడ్పీటీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పెద్దపల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ స్రవంతి, ఎంపీడీఓ, సర్పంచ్, ఎంపీటీసీలు, అధికారులు నివాళులర్పించారు.

అమరుల త్యాగాలు అజరామరం

గోదావరిఖని: రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు అజరామరమని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో అమరవీరుల స్తూపం వద్ద నివాళ్లర్పించారు. అమరుల త్యాగాలను నిరంతరం స్మరించుకోవాలనే సదాశయంతో సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల కుటుంబ సభ్యులకు ఉద్యోగంతో పాటు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించారన్నారు. రెండు నిమిషాలు మౌనం పాటించి, అమరవీరుల కుటుంబసభ్యులను సన్మానించారు. నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుతో కార్పొరేటర్లు పాల్గొన్నారు.

దశాబ్ది కాదు.. దగా ఉత్సవాలు



పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న విజయరమణారావు

- పాలనకు పదేళ్లు నిండక ముందే వేడుకలా..?
- తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీనే
- టీపీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర కాంక్షను నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీయేనని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. జిల్లాకేంద్రంలో కార్యకర్తలో కలిసి బైక్‌ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అక్కడ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. సీఎంగా రెండుపర్యాయాలు గెలిచిన కేసీఆర్ ఇప్పటివరకు ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. నిరుద్యోగులకు భృతి ఇవ్వలేదని, దళితుడిని సీఎం చేయలేదని, మూడెకరాలు కేటాయించలేదని మండిపడ్డారు. పాలనకు పదేళ్లు నిండకముందే దశాబ్ది ఉత్సవాలు అంటూ సీఎం తెలంగాణ ప్రజానీకాన్ని దగా చేస్తున్నారని తెలిపారు. 21రోజులపాటు రూ.కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ముందుకు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు యత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. నాయకులు వేముల రామ్మూర్తి, మల్లయ్య, సంపత్, సురేశ్‌గౌడ్, శ్రీనివాస్, అక్బర్ అలీ, తూముల సుభాష్, మస్రత్, ఎడెల్లి శంకర్, రఫీ, సునిల్, జగదీష్, తిరుపతి, అభిలాష్, మసూద్, నదీం, ఖాజా, శ్రవణ్ ఉన్నారు.

ప్రభుత్వాలను గద్దె దించుతాం

సుల్తానాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేవరకూ కాంగ్రెస్ పోరాటం ఆగదని విజయరమణారావు అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని పూసాలలో ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో మాట్లాడారు. పార్టీ అధికారంలోకొస్తే రూ.500లకు గ్యాస్, ఏకకాలంలోరూ.రెండు లక్షలు రుణమాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, అంతటి అన్నయ్య గౌడ్, మినుపాల ప్రకాష్ రావు, ఉట్ల వరప్రసాద్, దన్నాయక్, దామోదర్ రావు, చిలుక సతీష్, సాయిరి మహేందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ సొమ్ముతో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం

దశాబ్ది ఉత్సవాల పేరిట బీఆర్‌ఎస్ నాయకుల ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.దామోదర్ రావు ఆరోపించారు. మండలకేంద్రంలోని నెహ్రూ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్సై విజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు వరప్రసాద్, మాజీ సర్పంచ్ మినుపాల ప్రకాశ్‌రావు, కుమార్ కిషోర్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అమరుల ఆశయాలు కొనసాగిస్తాం

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు
- మంథనిలో స్మారక స్తూపం నిర్మాణానికి భూమిపూజ



భూమి పూజ చేస్తున్న మధు

మంథని: స్వరాష్ట్రం కోసం బలిదానం చేసిన అమరుల ఆశయ సాధన, ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం కేసిఆర్ పాలన నడుస్తోందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మంథనిలోని బొక్కలవాగు రెండో వంతెనపై అమరవీరుల స్మారక స్తూపం నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఉద్యమకారులను గౌరవిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పలువురిని సన్మానించారు. వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల కిరణ్ పాల్గొన్నారు.

తెలంగాణ సంపదను దోచేస్తున్నారు..

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాకూర్
- గోదావరిఖనిలో నిరసన ర్యాలీ



నిరసన ర్యాలీలో రాజ్‌ఠాకూర్, నాయకులు

గోదావరిఖని: ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం అవినీతి, సంపద దోపిడీ తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌ఠాకూర్ విమర్శించారు. గురువారం స్థానిక ప్రధాన చౌరస్తా నుంచి లక్ష్మినగర్‌వరకు కార్యకర్తలు, నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మేదరిబస్తీ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందన్నారు. క్విజ్ కాంపిటీషన్ ఇన్‌చార్జి రాజేశ్వర్, నాయకులు మహంకాళిస్వామి, ఎండీ.ముస్తాఫా, గాదం విజయానంద్, పెద్దెల్లి తేజస్విని, మారెల్లి రాజిరెడ్డి, చుక్కల శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అమరవీరులకు నివాళి అర్పిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ రావడం.. కేసీఆర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు కలగజేసుకుని ర్యాలీ సజావుగా ముందుకు వెళ్లేలా చూడటంతో ఊపిరి పీల్చుకున్నారు.

రామగుండంలో అసమర్థ పాలన

జ్యోతినగర్: నియోజకవర్గంలో అసమర్థ పాలన నడుస్తోందని రాజ్‌ఠాకూర్ అన్నారు. కార్పొరేషన్ ఐదో డివిజన్ అధ్యక్షుడు ఉప్పరపల్లి లక్ష్మయ్య, అబ్దుల్లా, రవి, శంకర్, రాజేశం, రహీం, ఆసిఫ్ పాషా ఆధ్వర్యంలో మల్కాపూర్, నర్రాశాలపల్లె, రామయ్యపల్లెలో జోడోయాత్రలో పాల్గొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో సామాన్యులు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎమ్మెల్యే అసమర్థతతోనే గోదావరి ఒడ్డున కరకట్ట నిర్మించలేకపోతున్నారని తెలిపారు. వర్షాలతో శ్రీనగర్‌కాలనీ ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా తయారైనా మున్సిపల్, ఎన్టీపీసీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు కాల్వ లింగస్వామి, కంక రాజు, కుంట భాగ్యలక్ష్మి, నర్సయ్య పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

రామగుండం: ప్రభుత్వం నిర్వహిస్తున్నవి దశాబ్ది వేడుకలు కాదని, దగా వేడుకలని మక్కాన్‌సింగ్‌ఠాకూర్ విమర్శించారు. కేసీఆర్ ప్రజలను మోసగించి పరిపాలిస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహశీల్దార్ జాహెద్‌పాషాకు వినతిపత్రం అందించారు. అంతర్గాం జంక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేష్, పెండ్రు హన్మాన్‌రెడ్డి, ఈదునూరి హరిప్రసాద్, సింగం కిరణ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

నత్తనడకన పనులు

- పూర్తికాని ఆరోగ్య కేంద్రాలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- అందుబాటులోకొస్తేనే మేలు
- జిల్లాకు 38 ఉపకేంద్రాలు మంజూరు
- ఒక్కో సబ్ సెంటర్‌కు రూ.20 లక్షలు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది జిల్లాలోని పెరపల్లి గ్రామానికి మంజూరైన ఆరోగ్య ఉపకేంద్రం భవనం. రూ.20 లక్షలతో చేపట్టిన ఈ ఉపకేంద్రం పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నాయి. స్లాబ్ వేసి ఇదిగో ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ కేంద్రం అందుబాటులోకొస్తే చుట్టుపక్కల ప్రజలకు వైద్య సేవలందే అవకాశం ఉంది. ఈ నెలాఖరు లోపు పనులు పూర్తికాకపోతే మరింత ఆలస్యం అయ్యే అవకాశముంది.



కనుకుల హెల్త్ సబ్ సెంటర్

సుల్తానాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం జిల్లాలోని 38 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు నూతన భవనాలు నిర్మించాలని సంకల్పించింది. ఒక్కో భవనానికి రూ.20లక్షల చొప్పున కేటాయించింది. టెండర్లు పూర్తయి రోజులు గడుస్తున్నా.. ఇప్పటివరకు కేవలం నాలుగు చోట్ల మాత్రం భవనాలను పూర్తిచేశారు కాంట్రాక్టర్లు. మిగిలిన చోట్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న వారు ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోగ్య ఉపకేంద్రాలను ఆరోగ్య, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. వానాకాలంలో పలు వ్యాధులు, సీజనల్ రోగాలు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు స్పందించి భవన నిర్మాణాల పనులను వేగవంతం చేయాలని కోరుతున్నారు. వైద్యులు ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. భవనాలు పూర్తికాకపోతే సేవలు అందించలేని పరిస్థితి నెలకొనే అవకాశముంది.

త్వరలో పూర్తి చేస్తాం



సబ్ సెంటర్ల పనులు కొన సాగుతున్నాయి. ఇప్పటివరకు 11 పూర్తయినా కాంట్రాక్టర్లు అప్పగించలేదు. 23 టెండర్ దశలో ఉన్నాయి. మెరుగైన వైద్యం పల్లె ప్రజలకు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చుతాం.

– ప్రమోద్ కుమార్, జిల్లా వైద్యాధికారి, పెద్దపల్లి

క్లుప్తంగా

ప్యాసింజర్ రైళ్ల రద్దు



భాగ్యనగర్ రైలుకు ప్రయాణికుల తాకిడి

రామగుండం: కాజీపేట–బల్లార్ష సెక్షన్ల మధ్య రైల్వే ట్రాక్ పునరుద్ధరణ, ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో రైల్వేశాఖ రెండు రోజుల క్రితం పలు ప్యాసింజర్ రైళ్లను ఈనెల 26వ తేదీ వరకు రద్దుచేసింది. ఇందులో భద్రాచలంరోడ్ సింగరేణి, బల్లార్ష ప్యాసింజర్, కాజీపేట రామగిరి, కరీంనగర్ పుష్‌పుల్ తదితర ప్యాసింజర్ రైళ్లను రద్దుచేశారు. ఇంటర్ సిటీ, కాగజ్‌నగర్, భాగ్యనగర్ రైళ్లను న డిపిస్తుండడంతో ప్రయాణికుల తాకిడి రెండింతలైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని స్టేషన్లలో హాల్టింగ్ ఉన్న ప్యాసింజర్ రైళ్లను ర ద్దు చేయడంతో సాధారణ, మధ్యతరగతి ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పర్సు అప్పగింత



పర్సు అప్పగిస్తున్న బ్లూకోల్ట్ సిబ్బంది

మంథని: మంథని బొక్కలవాగు వంతెనపై తోట రాజేందర్ అనే వ్యక్తి పర్సు పోగొట్టుకోగా అక్కడే ఉన్న ఓ వ్యక్తికి దొరకడంతో బ్లూకోల్ట్స్ సిబ్బంది హెడ్‌కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ రాజేశ్‌కు అప్పగించారు. పర్సులో ఉన్న ఐడీ కార్డు ఆధారంగా రాజేందర్‌కు ఫోన్ చేసి పర్సును అప్పగించారు. సిబ్బందిని ఎస్సై వెంకటేశ్వర్లు అభినందించారు.

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి



బైక్ పైన పడడంతో మృతిచెందిన సంజీవ్

పెద్దపల్లిరూరల్: మండలంలోని కాసులపల్లి శివారులో గురువారం బైక్ అదుపుతప్పడంతో చిందం సంజీవ్(42) అక్కడికక్కడే మృతి చెందాడు. కాసులపల్లి నుంచి బైక్‌పై జూలపల్లి మండలం కాచాపూర్‌లోని బంధువుల ఇంటికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో కింద పడ్డాడు. ఈక్రమంలో బైక్ అతని ఛాతీపై బలంగా పడడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై సహదేవ్‌సింగ్ తెలిపారు. మృతుడి భార్య శోభ ఫిర్యాదుతో కేసునమోదు చేశామన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు.

ఇటుక లోడ్ చేస్తుండగా జారిపడి కూలీ మృతి

పెద్దపల్లిరూరల్: మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులోని ఎస్ఎంఆర్ ఇటుకబట్టీలో ఇటుకలను లారీలో లోడ్ చేసి దిగుతుండగా జారీ కిందపడడంతో సురిబాబుదీప్ అనే ఒడిశా కూలీ బుధవారం మృతిచెందాడు. ఒడిశా రాష్ట్రంలోని బర్గర్ఫ్ జిల్లా బరిపాలి గ్రామానికి చెందిన సురిబాబుదీప్ ఎనిమిది నెలల క్రితం ఇటుకబట్టీలో పనిచేసేందుకు వచ్చాడని బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు. బుధవారం లారీలో ఇటుకలోడ్ చేసి దిగుతుండగా జారిపడి గాయాలు కాగా పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించడంతో గురువారం మృతుడి బంధువు నకులకొసర్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

అమరవీరులకు కౌన్సిల్ నివాళి

- సమావేశంలో 28 అంశాలకు ఆమోదం
- అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ల డిమాండ్





సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ అనిల్‌కుమార్, అమరులకు మౌనం పాటించి నివాళలుర్పిస్తున్న కార్పొరేటర్లు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ అధ్యక్షతన ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించడానికి ప్రవేశ పెట్టిన ఏకైక అజెండా అంశాన్ని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించింది. రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. మేయర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగాలు వెలకట్టలేనివని, తొలిదశలో 369 మంది, మలి దశ ఉద్యమంలో దాదాపు 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారని వెల్లడించారు. అమరవీరుల త్యాగాలను నిరంతరం గుర్తుంచుకోవాలని అన్నారు.

28 అంశాలకు కౌన్సిల్ ఆమోదం

సమావేశంలో మొత్తంగా 28 అంశాలు ప్రవేశ పెట్టగా అన్ని అంశాలూ ఆమోదం పొందాయి. సభ్యుల కోరిక మేరకు అన్ని డివిజన్లలో ప్రధానమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు అంచనాలు తయారుచేయాలని మేయర్ ఆదేశించారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రానున్న వర్షకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత కొరవడిందని, వర్షం కురిసినప్పుడల్లా ఎక్కడిక్కడ నీరు నిలిచిపోతోందని, వెంటనే ఈ రోడ్డుపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కార్పొరేటర్ మహంకాళి స్వామి డిమాండ్ చేశారు. తమ డివిజన్లలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పలువురు కార్పొరేటర్లు డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ నడిపల్లి అభిషేక్‌రావు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కమిషనర్ సుమన్ రావు, డిప్యూటీ కమిషనర్ నారాయణరావు, ఎస్ఈ చిన్నారావు, ఈఈ సుచరణ్, సూపరింటెండెంట్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కిరాణా వ్యాపారి మృతి



సంపత్‌రెడ్డి(ఫైల్)

జ్యోతినగర్: కిరాణ వస్తువుల కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధి మల్యాలపల్లె బస్‌స్టాప్ సమీపంలోని రాజీవ్ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో వాహనం అదుపుతప్పి కిందపడిన చిరువ్యాపారి మందల సంపత్‌రెడ్డి(48) తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఎన్టీపీసీ పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలం ఘన్‌శ్యాందాస్ నగర్ పంచాయతీ బీసీ కాలనీకి చెందిన సంపత్‌రెడ్డి కిరాణ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం కిరాణ సామగ్రి కొనుగోలు చేసేందుకు గోదావరిఖనికి వెళ్లి తిరిగివస్తుండగా మల్యాలపల్లె రాజీవ్ రహదారిపై హోండా ఆక్టివా వాహనం అదుపుతప్పి కిందపడింది. దీంతో తలకు బలమైన గాయమై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సంపత్‌రెడ్డికి భార్య లావణ్య, కుమారుడు లోకేశ్, కూతురు రుచిత ఉన్నారు. మృతుడి కుమారుడు లోకేశ్ ఫిర్యాదుతో ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ ద్వారా మెరుగైన సేవలు

గోదావరిఖని: సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ ద్వారా కార్మికులకు మరింత మెరుగైన సేవలు అందుతాయని రీజినల్ కమిషనర్ శ్రీహరిపచౌరీ, బీఎంఎస్ జాతీయ నాయకుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో రామగుండం ఏరియా ఎల్–20 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధానమంత్రి అధ్యక్షతన దేశంలో జీ–20 సదస్సు జరుగుతుందని, ఇందులో భాగంగానే ఎల్–20 కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి తీర్మానించి పంపాల్సి ఉందన్నారు. ఇందుకు దేశంలో 100 ఎల్–20 సదస్సులు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా సింగరేణిలో ఎల్–20 నాలుగు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మిట్‌లో బొగ్గు గని పరిశ్రమలో కార్మికులు ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించామన్నారు. బొగ్గు వెలికితీతకు ముందున్న సవాళ్లు ఎదుర్కొనేందుకు కార్మికులు ఏలా ముందుకెళ్లాలి. ప్రత్యామ్నాయ మార్గాలు, ఉద్యోగ భద్రత, తదితర సమస్యలపై చర్చించారు. సమావేశంలో బీఎంఎస్ నాయకులు టి.పవన్‌కుమార్, మండ రమాకాంత్, పులి రాజారెడ్డి, పొన్నమనేని వేణు గోపాలరావు, వై.సారంగపాణి, ఆకుల హరిణ్, సాయవేణి సతీశ్, వడ్డేపల్లి కుమారస్వామి, అరుకాల ప్రసాద్ పాల్గొన్నారు.

'కార్మికులు సమ్మె చేస్తే యాజమాన్యం తట్టుకోలేదు'

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులు ఎంతో సహనంతో ఉన్నారని, వారి సహనాన్ని పరీక్షించొద్దని ఉద్యమంలో భాగంగా సమ్మెచేస్తే తట్టుకోలేరని ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం నాయకులు యాజమాన్యానికి సూచించారు. గురువారం ప్రాజెక్టు లేబర్ గేట్ వద్ద చేపట్టిన మహా నిరసన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. వేతన ఒప్పందంలో జాప్యం తగదని యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరి సరికాదని ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులు హక్కుల కోసం 10నెలలుగా పోరాడుతున్నారని, మహారత్న కంపెనీలో కార్మికుల శ్రమ ఎంతో ఉందని గుర్తించాలని స్పష్టంచేశారు. కార్మికులు సమ్మె బాటపడితే జరిగే పరిణామాలకు యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మహా నిరసన పది గంటల వరకు కొనసాగింది. అనంతరం విధులకు కార్మికులు హాజరయ్యారు. నాయకులు కౌశిక హరి, ముత్యంరావు, చిలుక శంకర్, నాంసాని శంకర్, ఇజ్జగిరి భూమయ్య, లక్ష్మారెడ్డి, భూమల్ల చందర్, బూర్ల లక్ష్మీనారాయణ, రాధారపు రాజమల్లయ్య, సత్యం, లక్ష్మణ్, జమీల్, చంద్రయ్య, శ్రీనివాస్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు తెగిపోయిన విద్యుత్ వైర్లు

- గోదావరిఖనిలో భారీ వర్షం
- రాకపోకలకు అంతరాయం
- ఓసీపీ–5లో లేచిపోయిన ట్రిప్‌మెన్ షెడ్



రోడ్డుకు అడ్డంగా పడిన విద్యుత్ వైర్లు

గోదావరిఖని: గోదావరిఖనిలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. గాలివానకు ఫైవింక్లయిన్ బ్రిడ్జి వద్ద రోడ్డుకు అడ్డంగా హెచ్‌టీ విద్యుత్ లైన్ వైర్లు తెగి పడిపోయాయి. దీంతో ఆ రహదారి మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పలు వాహనాలను దారి మళ్లించారు. అలాగే జీడీకే–5ఫైవ్ ఓసీపీలో ట్రిప్‌మెన్ షెడ్ గాలికి కొట్టుకుని పోయి 10మీటర్ల లోతున్న క్వారీలో పడిపోయింది. దాంతోపాటే అందులో ఉన్న కార్మికుడు పడిపోయి స్వల్పంగా గాయపడ్డాడు. సుమారు గంట పాటు వర్షం ఇబ్బందులు సృష్టించింది. అలాగే రామగుండం రీజియన్‌లోని ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి కొంత సేపు అంతరాయం కలిగింది.

ఉపాధినిచ్చే పని.. ఉసురు తీసింది..

పెద్దపల్లిరూరల్: యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి వలసవచ్చి వ్యవసాయ బావుల్లో క్రేన్ సాయంతో పూడిక పనులు చేస్తూ జీవిస్తున్న అరవింద్ (23) గురువారం విద్యుత్ షాక్‌తో మృతిచెందడంతో వారి కుటుంబంలో తీవ్రవిషాదం నెలకొంది. స్థానికుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం దత్తప్పగూడెంకు చెందిన గొలుసుల యాదగిరి కుటుంబంతో పదేళ్లక్రితం పెద్దపల్లి మండలం మారెడుగొండకు వచ్చి అద్దెఇంట్లో ఉంటూ పరిసర గ్రామాల్లోని వ్యవసాయ బావుల్లో పూడికతీత పనులు చేసుకుంటున్నారు. మండలంలోని గుర్రాంపల్లిలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో గురువారం యాదగిరి అతని భార్య అంజమ్మ, కూతురు రమ్య, కుమారుడు అరవింద్‌తో పాటు అతని భార్య హేమలత పూడికతీత పనులు పూర్తిచేశారు. బావివద్ద విద్యుత్ మోటారును తిరిగి అమర్చేక్రమంలో మోటార్‌ను తీస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి ఏడాదిన్నర క్రితం జనగామ జిల్లా దేవరుప్పులకు చెందిన హేమలతతో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఐదునెలల గర్భిణీ. అరవింద్ మృతితో కుటుంబీకులు రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.

రాష్ట్ర రాజధానికి పోలీస్ అధికారులు

గోదావరిఖని: రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పోలీసు యంత్రాంగం నివేదికలు సిద్ధం చేస్తోంది. ఈనెల 23, 24తేదీల్లో జాతీయ ఎన్నికల కమిషన్ రాష్ట్ర రాజధానిలో అన్ని జిల్లాల ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సమావేశం నిర్వహిస్తోంది. దీనికోసం రామగుండం కమిషనరేట్ పోలీసులు నివేదిక సిద్ధం చేశారు. గత ఎన్నికల్లో ఓటింగ్ తీరు, సమస్యాత్మక ప్రాంతాలు, అతి సమస్యాత్మక ప్రాంతాలు, రీపోలింగ్ కేంద్రాలు తదితర వివరాలను పోలీసులు సేకరించారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లతో సీపీ రెమా రాజేశ్వరి ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఐదేళ్ల కిందట జరిగిన ఎన్నికల్లో అనుసరించిన తీరు, ప్రస్తుతం అనుసరించాల్సిన విధానం, పోలీసు బందోబస్తు, రూట్ మ్యాపింగ్, మావోయిస్టుల ప్రభావం తదితర అంశాలపై లోతుగా అధ్యయనం చేశారు. శుక్రవారం ఎన్నికల కమిషన్‌తో జరిగే సమావేశంలో పూర్తి వివరాలు నివేదించనున్నారు.

ఇద్దరు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి



వెంకటేశ్వర్లు

గోదావరిఖని: జిల్లాలో ఇద్దరు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి లభించింది. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సీసీఎస్ సీఐగా పనిచేస్తున్న చిలుకూరి వెంకటేశ్వర్లు, ఐటీ సెల్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న ఎండీ.సర్వర్‌కు పదోన్నతి కల్పిస్తూ గురువారం డీజీపీ ఆదేశాలు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



మహిళకు చికిత్స చేస్తున్న వైద్యసిబ్బంది

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని పూసాల రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతున్న మహిళను గురువారం ట్రాలీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలైంది. ఎస్సై విజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో మార్కండేయకాలనీకి చెందిన కట్ట అంజు(38) పూసాల రోడ్డు నుంచి రహదారి దాటుతుండగా పెద్దపల్లి వైపునకు వెళ్తున్న ట్రాలీ ఢీ కొట్టింది. దీంతో మహిళకు తీవ్రగాయాలు కాగా సుల్తానాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



ఆర్జీ–3 జీఎంకు మొక్క అందిస్తున్న ఎంపీపీ దేవక్క

కమాన్‌పూర్(రామగిరి): ఆర్జీ–3 పరిధిలోని సింగరేణి ప్రభావిత గ్రామాలైన బుధవారంపేట, రాజాపూర్ గ్రామాలకు సంబంధించి 708 ఎకరాల 16 గుంటల వ్యవసాయ భూములకు చెందిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క గురువారం ఆర్జీ–3 జీఎం ఎన్.సూధాకర్‌రావును మర్యాద పూర్వకంగా కలిసి సమస్యను వివరించారు. ఓసీపీ–2 ప్రాజెక్టు విస్తరణలో భాగంగా 2012లో బుధవారంపేట, రాజాపూర్ గ్రామాల పరిధిలో అవార్డ్ పాస్‌చేసిన 708 ఎకరాల 16 గుంటల వ్యవసాయ భూమిని హైకోర్టు రద్దు చేసిందన్నారు. దీంతో నాటినుంచి రెండు గ్రామాల రైతులకు ప్రభుత్వం అందించే రైతుబంధు, రైతుబీమా, నూతన పట్టాదారు పాసుబుక్కులు రాక ఇబ్బందులు పడుతున్నారని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. భూ సమస్యకు పరిష్కారం చూపకుండానే కేవలం 73 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు అంగీకరిస్తున్నారని అవార్డు రద్దుచేసిన భూములకు ఏలాంటి పరిష్కారం చూపించకపోవడంతో రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందని జీఎంకు ఎంపీపీ వివరించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎంపీపీ వెంట ఆరెల్లి కొమురయ్య గౌడ్ ఉన్నారు.

ఉద్యోగ విరమణ అధికారికి సన్మానం



గోపాల్‌ను సన్మానిస్తున్న జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు

కమాన్‌పూర్(రామగిరి): సింగరేణి సంస్థలో జనరల్ మేనేజర్(ఓసీపీ) కార్పొరేట్‌గా విధులు నిర్వహిస్తున్న వై.గోపాల కృష్ణమూర్తి ఈనెల 30న ఉద్యోగవిరమణ పొందుతున్న నేపథ్యంలో ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో గురువారం ఆర్జీ–3 ఏపీఏ జీఎంలు ఎన్.సూధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జీఎంలు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో 37 ఏళ్లుగా గోపాల కృష్ణమూర్తి వివిధ హోదాల్లో విధులు నిర్వహించి మంచి గుర్తింపు తెచ్చుకుని ఉన్నతాధికారులతో మన్ననలు పొందాడన్నారు. కార్యక్రమంలో అధికారులు ఎలిషా, రాధాకృష్ణ, నరేందర్, బైద్య, రఘుపతి, శ్రీనివాసులు, నాగరాజు, చంద్రశేఖర్, కర్ణ, సుధాకర్, నాగేశ్వరరావు, ఐలయ్య, లక్ష్మీనారాయణ, రవీందర్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చండి

- ఆర్‌జీ 3 జీఎంకు సర్పంచ్ వినతి



వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్ శ్రీనివాస్

మంథని: మండలంలోని బిట్టుపల్లి సమీపంలో రచ్చపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తాగునీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ కనవేన శ్రీనివాస్ గురువారం ఆర్జీ–3 జీఎం సుధాకర్‌రావుకు వినతిపత్రం అందించారు. గ్రామంలో 20 బోర్లు, 30 ప్లాట్లకు నీటి సరఫరా కోసం పైప్‌లైన్ మంజూరు చేయాలని కోరారు.

సింగరేణి డిస్పెన్సరీలో స్వచ్ఛత పక్షోత్సవాలు



స్వచ్ఛత పక్షోత్సవాల్లో అధికారులు, వైద్యులు

కమాన్‌పూర్(రామగిరి): సింగరేణి సంస్థ ఆర్జీ–3 పరిధిలో నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్షోత్సవాలను గురువారం సెంటనరీకాలనీలోని సింగరేణి డిస్పెన్సరీలో నిర్వహించారు. డిస్పెన్సరీలోని చెత్తచెదారం తొలగించారు. డిస్పెన్సరీ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని ఎస్వోఎం సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కల్యాణ్‌చక్రవర్తి, డాక్టర్ సీమనుసత్, సీనియర్ పీవో మతిన్, టీబీజీకేఎస్ ఫిట్ సెక్రటరీ జ్యోతిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో 'మోడల్' విద్యార్థుల ప్రతిభ



ట్యాబ్స్, సర్టిఫికెట్లు అందిస్తున్న రాష్ట్ర ఐటీ ముఖ్యకార్యదర్శి

ధర్మారం: హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన తెలంగాణ స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్ గ్రాండ్ ఫినాలేలో ధర్మారం మండలకేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయిలో టాప్ 10లో నిలిచినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మన్నె దీనా తెలిపారు. రాష్ట్రంలోని వివిధ పాఠశాలల నుంచి 13,670 నామినేషన్స్ రాగా అందులో నుంచి టాప్ 70 ఐడియాలను హైదరాబాద్ గ్రాండ్ ఫినాలేకు నిర్వాహకులు ఆహ్వానించారు. టాప్ 70 లో నుంచి టాప్ 10 ఐడియాలను ఎంపిక చేయగా ధర్మారం మోడల్ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థులు సింధూజ, శ్రీహాసలు గైడ్ శివకృష్ణ ఆధ్వర్యంలో అద్భుత ప్రతిభ కనబర్చి టాప్10లో నిలిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గైడ్ టీచర్‌తో పాటు ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు రాష్ట్ర ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ అధికారులు ట్యాబ్స్, సర్టిఫికెట్స్, జ్ఞాపికలు అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

బల్దియా ముందు కార్పొరేటర్ నిరసన

- తన డివిజన్‌లో రోడ్డు నిర్మించాలని డిమాండ్
- డిప్యూటీ మేయర్, కమిషనర్ చొరవతో విరమణ



బల్దియా ముందు నిరసన తెలుపుతున్న కార్పొరేటర్

కోల్‌సిటీ: కార్పొరేషన్ కార్యాలయం ముందు గురువారం 24వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక సుజాత బైఠాయించారు. ఆమెకు మద్దతుగా 25, 49 డివిజన్ల కార్పొరేటర్లు నగునూరి సుమలత, ఖాజాసన నిరసనలో పాల్గొన్నారు. సుజాత మాట్లాడుతూ.. ఎఫ్‌సీఐ ఎక్స్ రోడ్డు నుంచి ఎన్టీపీసీ రింగ్ రోడ్డు వరకు ఏడాదిన్నర క్రితం రూ.2కోట్ల పట్టణ ప్రగతి నిధులతో టెండరు పిలిచిన అధికారులు 9 నెలల క్రితం వర్కర్ ఆర్డర్ ఇచ్చినా ఇప్పటికీ ప్రారంభించలేదని ఆరోపించారు. పనులు ప్రారంభించాలని మంత్రి, ఎమ్మెల్యే, మేయర్ వరకు విన్నవించుకున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సమర్థత వల్లనే టెండరు పిలిచిన రోడ్డు నిర్మాణం జరగడం లేదని ఆరోపించారు. మేయర్ ఆమెతో మాట్లాడారు. డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో సుజాత నిరసన విరమించారు.

వర్క్‌షాప్‌ను ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకోం



గోదావరిఖని: ఏరియా వర్క్‌షాప్‌ను ప్రైవేట్‌కు అప్పగించే ప్రయత్నాలు సాగుతున్నాయని, దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించే ప్రసక్తేలేదని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఏరియా ఆసుపత్రి, వర్క్‌షాప్‌లో ఏర్పాటుచేసిన వేర్వేరు గేట్‌మీటింగ్‌లలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో వర్క్‌షాప్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే ఊరుకోమని ఆందోళనలు పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. మెడికల్ స్టాఫ్ నర్స్‌లకు క్యాడర్ స్కీంలో అన్యాయం జరిగిందని, వారికి మెరుగైన క్యాడర్ స్కీమ్ అమలయ్యేలా కృషి చేస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నామన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయించడంలో యూనియన్ కృషిచేసిందన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు సదానందం, నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, వైస్ వికాస్‌కుమార్, రాజేందర్, టైసన్ శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం గాలికొదిలేసిన యాజమాన్యం

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. గురువారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కృషిభవన్‌లో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కార్మికవాడలకు మంచినీరు అందించలేని పరిస్థితిలో యాజమాన్యం ఉందన్నారు. ఓసీపీ–3లో హాలేజీ రోడ్లు సరిగా లేక ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫైర్‌కోల్ లిఫ్టింగ్ మూలంగా ఆపరేటర్లు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని, తక్షణమే సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కోల్ ఇండియా మాదిరిగా పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ రీయంబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు. ఓటమి భయంతోనే రాష్ట్ర ప్రభుత్వం, గుర్తింపు ఎన్నికలు జరగకుండా కుట్ర పన్నుతోందనానరు. నాయకులు రాజారత్నం, బుర్ర తిరుపతి, అన్నారావు, సాంబశివరావు, రాజాసాగర్, ఆవుల రవికుమార్, జిగురు రవీందర్ పాల్గొన్నారు.